
టీ షర్టులను ఆవిష్కరిస్తున్న సీపీ సీవీ ఆనంద్ తదితరులు

యువత క్రీడలపై దృష్టి సారించాలి

- కమిషనర్ సీవీ ఆనంద్

బంజారాహిల్స్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): యువత క్రీడలపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్ (హోటా) ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ క్లబ్‌లో 21వ జాతీయ స్థాయి ఓపెన్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించి టీ షర్టులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ నిత్యం ఆటలు ఆడటం వల్ల మానసికంగా, శారీరకంగా దృఢంగా అవ్వడంతో పాటు ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. దేశవ్యాప్తంగా ఎంతోమంది క్రీడల్లో రాణిస్తున్నారని, వారికి మరింత ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ స్థాయి ఓపెన్ టోర్నమెంట్‌కు జేఐసీసీ వేదికగా మారడం ఆనందకరమన్నారు. అనంతరం ఆయన టెన్నిస్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ క్లబ్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కార్యదర్శి కిలారు రాజేశ్వర్‌రావు, హోటా అధ్యక్షుడు నంద్యాల నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

ఎర్రగడ్డ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని విజయలక్ష్మి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. శ్రీమంత్ర సహిత శ్రీసూక్త హవనము, మంగళ శాసనం, యాగశాలలో నిత్య హోమం తదితర కార్యక్రమాలను చేపట్టారు. సాయంత్రం విజయలక్ష్మీ అమ్మవారి గజవాహన సేవలో భాగంగా దేవాలయం నుంచి ఎస్సార్‌నగర్ వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈ ఉత్సవాలు 10వ తేదీతో ముగుస్తాయని దేవాలయ కమిటీ చైర్మన్ చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి పీజనార్దన్, కోశాధికారి ఎన్‌వీ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు గట్టు రంగాచారి, మేనేజర్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 గంటల వరకు 11కెవి కామత్ లింగాపూర్ హౌస్,ఇంటర్ గ్రాఫ్ ఫీడర్ల పరిధిలోని ప్రకాష్‌నగర్ ఎక్స్ టెన్షన్, వాటర్ ట్యాంక్, కామత్ లింగాపూర్ హౌస్, ఇంటర్ గ్రాఫ్ ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి 3 గంటల వరకు 11కెవి స్వరాజ్ నగర్ ఫీడర్ పరిధిలోని స్వరాజ్ నగర్ సైట్-2, సాయిబాబా నగర్, పర్వత నగర్, అల్లాపూర్, బంజారా నగర్ ప్రాంతాల్లో.. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 వరకు అమీర్‌పేట ఎంసీహెచ్ మార్కెట్, ది హిందూ ఫీడర్ల పరిధిలోని అపరాజిత కాలనీ, సాదత్ మంజిల్, ఎంసీహెచ్ మార్కెట్, ఎస్ఆర్టీ కాలనీ, వెంకట్ ప్లాజా, ఒర్రా, కృష్ణా జువెల్లర్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువకుడి అరెస్ట్

బోరబండ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువకుడిని మధురానగర్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలుచోట్ల క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్టు ఫిర్యాదులు వచ్చాయి. ఎస్ఐ శివశంకర్ సిబ్బందితో కలిసి గురువారం రాత్రి విధి నిర్వహణలో ఉండగా గాంధీబొమ్మ వద్ద ఓ యువకుడు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించాడు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా ఆన్‌లైన్ బెట్టింగ్ చేస్తున్నట్టు అంగీకరించాడు. అతడి వద్ద ఉన్న మొబైల్‌ను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

బోరబండ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైన ఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ తుల్జారామ్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా ఉప్పరపల్లి గ్రామానికి చెందిన యాపచెట్టు రాజు (38)కు మతిస్థిమితం సరిగా ఉండటం లేదు. ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం ఎస్పీఆర్ హిల్స్ రాజీవ్‌గాంధీ నగర్‌లోని సోదరుడి ఇంటికి గత నెల 28న వచ్చాడు. నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాజు తిరిగి రాలేదు. తెలిసిన వారి వద్ద విచారించినా ప్రయోజనం లేకపోవడంతో రాజు సోదరుడు మహేష్ బోరబండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హెల్త్ సెంటర్‌లో సమస్యల ఏకరువు

- సరిపడా వైద్యులు, స్టాఫ్ నర్సులు లేక రోగుల అవస్థలు
- తాగునీటికి సైతం ఇబ్బందులే
- లిఫ్ట్ ఉన్నా వినియోగించుకోలేని పరిస్థితి
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రోగులు

ఖైరతాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మూడేళ్ల క్రితం 50 పడకల ఆస్పత్రిని ప్రారంభించడంతో ఖైరతాబాద్ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఎలాంటి అత్యవసర సమయంలోనైనా తక్షణమే ఆదుకునే ఆస్పత్రి అందుబాటులోకి వచ్చిందని ధీమా వ్యక్తం చేశారు. మొదట దీనిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మారుస్తామని స్థానిక ప్రజాప్రతినిధులు చెప్పినా చివరకు ఖైరతాబాద్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా ప్రారంభించి సరిపెట్టుకున్నారు. ప్రతిచోటా కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు స్థానిక ఎమ్మెల్యేలు చైర్మన్లుగా ఉంటారు. ఇందులో అందుతున్న సేవలు, సిబ్బంది వివరాలతో పాటు ఆస్పత్రి అభివృద్ధికి సహకారం అందిస్తూ వైద్యసేవలు నిరంతరాయంగా కొనసాగేలా చూడడం వారి బాధ్యత. అయితే ఇక్కడి ఎమ్మెల్యే ఈ ఆరోగ్య కేంద్రాన్ని పట్టించుకోకపోవడంతో ఎన్నో సమస్యలతో సతమతమవుతోంది. కనీసం ప్రతిరోజూ ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు, వారి సహాయకులకు తాగునీటి వసతి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరిపడా స్టాఫ్ నర్సులు లేకపోవడంతో 24 గంటల వైద్య సేవల్లో ఇబ్బందులు, అవసరం మేరకు వైద్యులు లేకపోవడం, లిఫ్ట్ ఉన్నా వినియోగించలేని దుస్థితి ఇక్కడ నెలకొంది.

నిండు గర్భిణులు సైతం మెట్లు ఎక్కాల్సిందే

ఖైరతాబాద్‌లో రూ.10 కోట్ల వ్యయంతో వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలో నాలుగంతస్తుల్లో ఆస్పత్రి భవనాన్ని నిర్మించారు. ఇందులో మొదటి, మూడవ, నాలుగవ అంతస్తు సగ భాగంలో సామాజిక ఆరోగ్య కేంద్రం నడుస్తుండగా.. రెండవ అంతస్తులో ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, జర్నలిస్టుల కోసం వెల్‌నెస్ సెంటర్ నడుస్తోంది. నాలుగో అంతస్తు మరో సగ భాగంలో డీసీహెచ్ఎస్ హైదరాబాద్ నిర్వహణాధికారి కార్యాలయం ఉంది. ఈ భవన విద్యుత్ బిల్లు వెల్‌నెస్ సెంటర్ నిర్వాహకులు చెల్లిస్తున్నందున లిఫ్ట్‌ను వారు మాత్రమే వినియోగిస్తూ ఆరోగ్య కేంద్రానికి వచ్చేవారిని అనుమతించడం లేదు. దీంతో మొదటి, మూడవ, నాలుగవ అంతస్తులో వైద్య సేవలు పొందేందుకు వచ్చే గర్భిణులు, ప్రసవానంతరం చికిత్స తీసుకుని బాలింతలతో పాటు వృద్ధులు సైతం మెట్లపై నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది.

వాటర్ ప్లాంట్ దాతల కోసం నిరీక్షణ

ప్రతిరోజూ ఈ ఆరోగ్య కేంద్రంలో 200 నుంచి 300 మంది ఔట్ పేషెంట్‌లు, వారి సహాయకులు కలిపి దాదాపు 500 మంది వరకు వస్తుంటారు. వారందరికీ కనీసం తాగునీటి వసతి లేదు. జలమండలి వారు నల్లా కనెక్షన్ ఇచ్చినా శుద్ధ జలంగా మార్చే మినరల్ వాటర్ ప్లాంటు లేదు. అయితే ఆస్పత్రి ప్రారంభం నుంచి దాతల కోసం ఎదురు చూస్తున్నారు తప్ప ప్రజాప్రతినిధులెవరూ పట్టించుకోలేదు. దీంతో సరిపడా తాగునీరు లేక రోగులు, వారి సహాయకులు, ఆస్పత్రి సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రారంభంలో కొంత మేర నిర్వహణ ఖర్చులిచ్చినా, ప్రస్తుతం ప్రభుత్వం నుంచి అవి రాకపోవడంతో వైద్యులు, సిబ్బంది సొంత ఖర్చుతో తాగునీరు, ఇతర అవసరాల కోసం వినియోగించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.


ఖైరతాబాద్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్

స్టాఫ్ నర్సుల కొరతతో సేవలకు ఇబ్బందులు

ఆరోగ్య కేంద్రంలో శస్త్ర చికిత్సలు చేసే సర్జన్, ఆర్థోపెడిక్ వైద్యుడు, కంటి వైద్యుడు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్రంలో కనీసం ఎక్స్‌రే సౌకర్యం లేదు. గతంలో ఇక్కడ వారానికి 5 నుంచి8 కాన్పులు జరిగేవి. అయితే గైనకాలజిస్టును బదిలీ చేయడంతో ఇతర కేంద్రాల నుంచి గైనకాలజిస్టులు వచ్చినప్పుడు మాత్రమే కాన్పులు చేసే పరిస్థితి ఉంది. దీంతో కాన్పుల సంఖ్య గణనీయంగా తగ్గింది. మరోవైపు గతంలో 29 మంది స్టాఫ్ నర్సులు ఉండగా, ఇటీవల 10 మందిని డిప్యుటేషన్‌పై ఇతర ప్రాంతాలకు పంపడంతో 24 గంటల పాటు వైద్య సేవలందించడంలో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజాప్రతినిధులు, వైద్య విభాగం ఉన్నతాధికారులు వెంటనే స్పందించి డిప్యుటేషన్‌పై పంపించిన స్టాఫ్ నర్సులను తిరిగి తీసుకురావాలని, వాటర్ ప్లాంట్, ఎక్స్‌రే సెంటర్ ఏర్పాటు చేయడంతో పాటు ఇతర సమస్యలను సైతం పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న రోగులు

ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వండి

- హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అభ్యర్థుల విజ్ఞప్తి

బేగంపేట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ ద్వారా ఎంపికైన తమకు ఉద్యోగ నియామక పత్రాలు ఇవ్వాలని కోరుతూ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అభ్యర్థులు ప్రజావాణి ఇన్‌చార్జ్, డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డికి విజ్ఞప్తి చేశారు. ప్రజా భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ పెద్ద ఎత్తున తరలి వచ్చి చిన్నారెడ్డికి సమస్యలను వివరించారు. స్పందించిన చిన్నారెడ్డి టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. దీంతో త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని నవీన్ నికోలస్ హామీ ఇచ్చారు. సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ మండలం పటేల్‌గూడ గ్రామంలో అక్రమ లేఔట్‌లోని 112 ప్లాట్లను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఆ కాలనీవాసులు శుక్రవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. వారి సమస్యలను కలెక్టర్‌కు వివరించి సమస్యను పరిష్కరించాలని చిన్నారెడ్డి సూచించారు.


చిన్నారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అభ్యర్థులు

ప్రజావాణికి 346 అర్జీలు

శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 346 అర్జీలు అందాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 45, విద్యుత్ శాఖకు 26, రెవెన్యూకు 37, ఇందిరమ్మ ఇళ్లకు 184, ఇతర శాఖలకు 53 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి ఇన్‌చార్జి, చిన్నారెడ్డి అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు.

పురుగులు పట్టిన పిండి.. పాడైన టమోటాలు

- హోటళ్ల తనిఖీల్లో వెలుగుచూసిన వాస్తవాలు

బంజారాహిల్స్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అధికారులు నిర్వహించిన హోటల్ తనిఖీల్లో పురుగులు పట్టిన బియ్యపు పిండి, పాడైన టమోటాలు, అపరిశుభ్ర వాతావరణం వెలుగు చూస్తున్నాయి. ఫుడ్ సెఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారులు ఈ నెల 6న అమీర్‌పేటలోని తాజా కిచెన్, అమోఘా హోటల్ అండ్ కేఫ్‌లో తనిఖీలు చేశారు. తాజా కిచెన్‌లో నీటి సంరక్షణకు ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించలేదు. ఫ్రిడ్జ్‌లో సగం ఉడికించిన ఆహార పదార్థాలు, ఆహారానికి సంబంధం లేని పదార్థాలను ఎటువంటి రక్షణ చర్యలు లేకుండా ఉంచినట్టు తేలింది. బియ్యపు పిండిలో పురుగులు, పాడైన టమోటాలు, కొన్ని ఆహార పదార్థాల్లో వెంట్రుకలు ఉన్నట్టు గుర్తించారు. అమోఘా హోటల్‌లో కిచెన్‌లో ఫ్లోరింగ్ అపరిశుభ్ర, గ్రైండింగ్, వాషింగ్ ఏరియా పూర్తి చెత్తతో నిండిపోయి ఉండటం గమనించారు. సింథటిక్ ఫుడ్ కలర్స్ వాడుతున్నట్టు తేలింది. టాయిలెట్, కిచెన్‌తో అనుసంధానం చేసి ఉండటం వల్ల దుర్వాసన వ్యాప్తి చెందేలా ఉంది. దీంతో అధికారులు ఈ హోటళ్ల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు.


పురుగులు పట్టిన బియ్యం పిండి.. అమోఘా హోటల్ కిచెన్‌లో అపరిశుభ్రత

రైల్వేస్టేషన్‌లో మంటలు.. ప్రయాణికుల ఆందోళన

ఖైరతాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రైల్వే పట్టాల మధ్య ఉన్న చెత్తతో పాటు ఎండిపోయిన మొక్కలకు నిప్పు అంటుకోవడంతో శుక్రవారం ఖైరతాబాద్ రైల్వేస్టేషన్‌లో ఆందోళన నెలకొంది. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఖైరతాబాద్ రైల్వే స్టేషన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అక్కడ ఎంఎంటీఎస్ రైళ్ల కోసం వేచిఉన్న ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. దట్టమైన పొగలు రావడంతో పాటు పైభాగంలో హైఓల్టేజీ విద్యుత్ వైర్లు ఉండడంతో ప్రయాణికులతో పాటు అధికారులు, సిబ్బంది ఆందోళన చెందారు. కొందరు ప్రయాణికులు నీళ్లు తీసుకొచ్చి చల్లడంతో కాసేపటికి మంటలు అదుపులోకి వచ్చాయి. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగా, ఖైరతాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారం వరకు ఫైరింజన్ వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఒకవేళ భారీ ప్రమాదం జరిగితే మంటలను ఎలా ఆర్పేవారని ప్రయాణికులు, స్థానికులు ప్రశ్నించారు. ఒకవైపు రైల్వే ప్లాట్ ఫారం పైకి బస్తీ గుండా వచ్చే మార్గాన్ని కొందరు స్థానికులు ముళ్ల పొదలు, చెట్ల కొమ్మలు వేసి రాకపోకలు జరగకుండా చేయగా రోడ్డువైపు నుంచి వచ్చే రహదారి గుండా వాహనాలు వచ్చే ఏర్పాట్లు చేయలేదు.

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఘనంగా వేడుకలు నిర్వహించడంతో పాటు పలు రంగాల్లో రాణిస్తున్న మహిళలకు అవార్డులు అందజేసేందుకు పలుచోట్ల ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

- ఖైరతాబాద్/బంజారాహిల్స్, మార్చి 7(ఆంధ్రజ్యోతి)

గతంతో పోలిస్తే మెరుగైన స్థితిలో మహిళలు



విద్య, ఉద్యోగాల్లో గతంతో పోలిస్తే ప్రస్తుతం మహిళలు ఎంతో మెరుగైన స్థితిలో ఉన్నారు. వర్క్ లైఫ్ బ్యాలెన్స్ చేయడానికి మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. వారు ఒత్తిడిని అధిగమించడానికి కుటుంబ సభ్యుల మద్దతు అవసరం. పిల్లలను సమాన భావంగా పెంచాలి. కుటుంబ సభ్యులంతా ఒకరికొకరు పూర్తి సహకారంతో మెలిగే వాతావరణాన్ని కల్పించుకోవాలి.

- ప్రశాంతి, జీహెచ్ఎంసీ సర్కిల్ 18 ఉప కమిషనర్

రాజకీయాల్లో ప్రాధాన్యం ఇవ్వాలి



మహిళలకు రాజకీయాల్లో మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది. మహిళా సాధికారత అంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటనలు చేస్తున్నాయి తప్ప వారికి సమాన హక్కులు ఇవ్వడంలో మాత్రం విఫలమవుతున్నాయి. ఎన్నికల సమయంలో మహిళల ఓట్లను ఆశించే నాయకులు వారికి తగిన విధంగా సీట్లను కేటాయించడం లేదు. రాజకీయాలు పక్కన పెడితే మిగతా రంగాల్లో మాత్రం మహిళలు విశేషంగా రాణిస్తున్నారు. వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో భవిష్యత్తు సవాళ్లను అధిగమిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. రాబోయేకాలంలో మహిళలు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నా.

- ఉప్పలపాటి అనూషారామ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు

నేడు నారీరత్న అవార్డుల ప్రదానం

ఎర్రగడ్డ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎర్రగడ్డకు చెందిన కవయిత్రి, రచయిత్రి మండపాక అరుణకుమారి నారీరత్న ఉమెన్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు అందుకోనున్నారు. సాహిత్య, సాంస్కృతిక, సామాజికసేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఆమెకు అవార్డు అందజేస్తున్నట్లు వేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆమెతో పాటు మరికొందరు మహిళలకు నేడు అవార్డులను ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

ఆరోగ్య సంరక్షణకు 'యోగా'..



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీలో ఫిట్ ఇండియాలో భాగంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, అరుణ యోగా శిక్షణ, పరిశోధన సంస్థ సంయుక్తంగా శుక్రవారం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ ప్రొ.జి.పుష్పా చక్రపాణి, డా.ఎన్ రజనీ, విశ్వవిద్యాలయ మహిళా విభాగం ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రొ.మేరీ సునంద, డా.కె.శ్రీదేవి, డా.రజనీ, డ్రా.ప్రమీల కేతావత్ పాల్గొన్నారు.

- హైదరాబాద్ సిటీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి)



ఏఐఎన్‌యూలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డా.జి.రామేశ్వర్ తదితరులు


సనత్‌నగర్ పరిధిలో పనిచేస్తున్న ఆశా వర్కర్‌లను సన్మానిస్తున్న సరోజిని కంటి ఆస్పత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్‌గౌడ్

ఘనంగా మహిళా దినోత్సవం

బంజారాహిల్స్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదులు పేర్కొన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవంలో భాగంగా ట్రాఫిక్ విభాగంలో సేవలందిస్తున్న మహిళా ఉద్యోగులను శుక్రవారం ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఉన్నత పదవుల నుంచి చిన్న ఉద్యోగాల వరకు మహిళలు సేవలందిస్తున్నారన్నారు. స్టేషన్‌లో మల్లీశ్వరి అనే ఉద్యోగి ఓ ప్రమాదంలో భర్తను కోల్పోయినప్పటికీ ధైర్యంగా విధులు నిర్వహిస్తూ తన కుమారుడిని బీటెక్ చదివిస్తుందన్నారు. ఇలాంటి సంఘటనలు అనేకం ఉన్నాయని ఆయన వెల్లడించారు.

ఎకోపార్కులో..

హైదరాబాద్ సిటీ, మార్చి7 (ఆంధ్రజ్యోతి): హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో కోత్వాల్‌గూడ ఎకో పార్కులో శుక్రవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. అమీర్‌పేటలోని స్వర్ణ జయంతి కాంప్లెక్స్ శుక్రవారం నుంచి డబుల్ డెక్కర్ బస్సులో మహిళా ఉద్యోగులను ఎకో పార్కుకు తీసుకెళ్లి పార్కును అధునాతనంగా తీర్చిదిద్దిన వైనాన్ని వివరించారు. అక్కడ వినోదభరిత కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమానికి కుటుంబ సమేతంగా హాజరైన హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ మాట్లాడుతూ.. హెచ్ఎండీఏ ఈ స్థాయికి చేరడంలో మహిళా ఉద్యోగుల పాత్ర ఉందని, మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తించి హెచ్ఎండీఏ ప్రతిష్టను పెంచాలని సూచించారు. హెచ్‌జీసీఎల్ సీజీఎం పరంజ్యోతి, హెచ్ఎండీఏ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షురాలు ఉమ తదితరులు పాల్గొన్నారు.


సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు

వాటర్‌బోర్డు కార్యాలయంలో..

ఖైరతాబాద్‌లోని వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఉస్మానియా ఆసుపత్రి వైద్యురాలు ఎం.అనిత హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జలమండలి ఉమెన్స్ మినిస్టీరియల్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈఎన్సీ, డైరెక్టర్ ఆపరేషన్స్-2 వీఎల్ ప్రవీణ్ కుమార్, సీజీఎంలు అబ్దుల్ ఖాదర్, నారాయణ, చంద్రజ్యోతి, జీఎంలు సుగంధిని, సరస్వతి పాల్గొన్నారు.

సిటీ బస్ డ్రైవర్‌పై ఆటో డ్రైవర్ దాడి

పంజాగుట్ట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): టీఎస్ ఆర్టీసీ సిటీ బస్ డ్రైవర్‌పై ఆటో డ్రైవర్ దాడికి పాల్పడ్డాడు. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన జగన్నాథం ముషీరాబాద్ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో పంజాగుట్ట ప్రధాన రహదారిలో ఆటోకు బస్సు తగిలింది. దీంతో ఆటో డ్రైవర్ బస్ డ్రైవర్‌తో ఘర్షణకు దిగి దాడిచేశాడు. బస్ డ్రైవర్ జగన్నాథం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

యోగానంద మహాసమాధి ఆరాధనోత్సవాలు

హైదరాబాద్ సిటీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): బేగంపేట చికోటి గార్డెన్స్‌లోని యోగదా సత్సంగ ధ్యాన కేంద్రంలో యోగదా సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు పరమహంస యోగానంద మహాసమాధి ఆరాధనోత్సవాలను నిర్వహిస్తున్నారు. భక్తులు ధ్యానం, భజనల్లో పాల్గొంటున్నారు. రేపు సాయంత్రం 5 గంటలకు వైఎస్ఎస్ గురుపరంపరలో ఒకరైన స్వామి యుక్తేశ్వర్‌గిరి మహాసమాధి ఆరాధన ఉత్సవాలు బేగంపేట ధ్యానకేంద్రంలో జరుగుతాయని వైఎస్ఎస్ కార్యదర్శి శశివదనారెడ్డి తెలిపారు.

'కొత్త టెక్నాలజీతో సంతాన సాఫల్యత'

మోతీనగర్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని డిపార్ట్‌మెంట్ ఆఫ్ రీజెనరేటివ్ మెడిసిన్ అండ్ రీప్రొడక్టివ్ ఇమ్యునోజెనెటిక్స్‌ను ప్రారంభించినట్లు హెగ్డే క్లినికల్ నిర్వాహకులు డాక్టర్ వందన హెగ్డే శుక్రవారం తెలిపారు. మాదాపూర్‌లో ఆమె మాట్లాడుతూ.. కొత్త టెక్నాలజీతో తక్కువ స్పెర్మ్ కౌంట్, అజోస్పెర్మియా, అండాశయ వైఫల్యం వంటి సమస్యలను పరిష్కరించవచ్చన్నారు.



ట్రాఫిక్ ఆంక్షలను సూచించే మ్యాప్

నేడు ఇందిరా మహిళా శక్తి 2025' వేడుకలు

● పరేడ్ గ్రౌండ్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం నిర్వహిస్తున్న 'ఇందిరా మహిళా శక్తి 2025' కార్యక్రమం సందర్భంగా పరేడ్ గ్రౌండ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని జాయింట్ సీపీ జోయల్ డేవిస్ తెలిపారు. కార్యక్రమానికి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండడంతో పంజాగుట్ట, గ్రీన్ ల్యాండ్స్, బేగంపేట, సికింద్రాబాద్, పెరేడ్ గ్రౌండ్ ప్రాంతాల్లో సాయంత్రం 3 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమం జరుగుతున్న సమయంలో టివోలీ క్రాస్‌రోడ్స్ నుంచి ప్లాజా క్రాస్‌రోడ్ వరకు మార్గాన్ని మూసివేయనున్నట్టు తెలిపారు. చిలకలగూడ క్రాస్‌రోడ్స్, ఆలుగడ్డబావి క్రాస్‌రోడ్స్, సంగీత్ క్రాస్‌రోడ్స్, వైఎంసీఏ క్రాస్‌రోడ్స్, పాట్నీ క్రాస్‌రోడ్స్, ఎస్‌బీహెచ్ క్రాస్‌రోడ్, ప్లాజా, సీటీఓ జంక్షన్, బ్రూక్‌బాండ్ జంక్షన్, తివోలి జంక్షన్, స్వీకార్ ఉపకార్ జంక్షన్, సికింద్రాబాద్ క్లబ్, తిరుమలగిరి క్రాస్‌రోడ్స్, తాడ్‌బన్ క్రాస్‌రోడ్స్, సెంటర్ పాయింట్, డైమండ్ పాయింట్, బోయినపల్లి క్రాస్‌రోడ్స్, రసూల్‌పురా జంక్షన్, బేగంపేట్, ప్యారడైజ్ జంక్షన్‌లలో పరిస్థితిని బట్టి వాహనాల మళ్లింపులు ఉంటాయన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జేబీఎస్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ముందుగా బయలుదేరాలని సూచించారు. పంజాగుట్ట, గ్రీన్‌ల్యాండ్స్, బేగంపేట, పెరేడ్ గ్రౌండ్స్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో రద్దీ ఎక్కువగా ఉండే అవకాశమున్నందున ఈ రూట్లలో ప్రయాణించకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని సూచించారు.



పీఎం జన ఔషధి దివస్ 7వ వార్షికోత్సవ ముగింపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తిరుమలగిరిలోని 3022 కేంద్రాన్ని ఎంపీ ఈటల రాజేందర్ సందర్శించి ప్రజలకు పలు సూచనలు చేశారు. మాజీ సైనికుల విభాగం బీజేపీ రాష్ట్ర కన్వీనర్, జన ఔషధి కేంద్రాల నిర్వాహకులు గోపు రమణా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ వెంకట్, మాజీ కంటోన్మెంటు బోర్డు సభ్యురాలు నర్మదా మల్లికార్జున్, బీజేపీ సీనియర్ నాయకులు, కెప్టెన్ అవదేశ్ మిత్రా, డీకే సింగ్, కార్యకర్తలు అభిమానులు, నర్సులు, జన ఔషధి సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు పలువురికి మెమోంటోలు అందజేశారు.
- తిరుమలగిరి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి)

సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

తిరుమలగిరి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి వరం లాంటిదని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. తిరుమలగిరి మండలానికి చెందిన 31మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. ఇందలో 21మంది కల్యాణలక్ష్మి, 10మందికి షాదీ ముబారక్ చెక్కులు మంజూరయ్యాయి. ఈమేరకు శుక్రవారం లాల్‌బజార్‌లోని ఆర్యవైశ్య యువజన సంఘం భవనంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ హారిక, కంటోన్మెంట్ కాంగ్రెస్ నాయకులు మురళీ ముదిరాజ్, నాగినేని సరిత, భవాని, మేరి, కాంగ్రెస్ నాయకులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి శుక్రవారం తార్నాకలోని తన నివాసంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి అనంతరం విందులో పాల్గొన్నారు.
- తార్నాక, మార్చి 7(ఆంధ్రజ్యోతి)

'యువత క్రీడలపై దృష్టి సారించాలి'

బంజారాహిల్స్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): యువత క్రీడలపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అన్నారు. హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ అసోసియేషన్ (హోటా) ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ క్లబ్‌లో 21వ జాతీయస్థాయి ఓపెన్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించి టీ షర్టులను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ నిత్యం ఆటలు ఆడటంవల్ల మానసికంగా, శారీరకంగా దృఢంగా అవ్వడంతో పాటు ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. దేశవ్యాప్తంగా ఎంతోమంది క్రీడల్లో రాణిస్తున్నారని, వారికి మరింత ప్రోత్సాహం అందించాలన్నారు. జాతీయ స్థాయి ఓపెన్ టోర్నమెంట్‌కు జేపీసీసీ వేదికగా మారడం ఆనందకరమన్నారు. అనంతరం ఆయన టెన్నిస్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు.

● అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో శుక్రవారం ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. మహిళ, పిల్లల సంరక్ష విభాగం డీసీపీ సృజన కర్ణం పర్యవేక్షణలో మహిళలతో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు వృత్తి నిపుణులైన ఆర్థిక వ్యవహారాలు, మానసిక వైద్య, చాటెర్డ్ అకౌంటెంట్‌లతో ప్రత్యేకంగా మహిళల ఆర్థిక ప్రణాళికపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏసీపీ వి.ప్రసన్న కుమార్, సీఏఏ అడ్మిన్ గీత, పలువురు మహిళా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



అంతకు ముందు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి మహిళా పోలీసులకు శుభాకాంక్షలు తెలిపారు.
- హైదరాబాద్ సిటీ, మార్చి 7(ఆంధ్రజ్యోతి)



● యాక్షన్ ఎయిడ్ కర్నాటక ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనం గా జరిగాయి. బేగంపేట్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గృహ హింస, పని చేసే ప్రాంతాల్లో జరిగే హింస, తదితర అంశాలపై వక్తలు మాట్లాడారు. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఏఎస్ఐ సంజీవ రాణి, కానిస్టేబుల్ జహంగీర్, యాక్షన్ ఎయిడ్ ప్రోగ్రాం ఆఫీసర్ వందన బర్దర్ పాల్గొన్నారు.
- సికింద్రాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి)

నేడు మహిళ అబలకాదు.. సబల. మహిళలు నేడు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో సత్తా చాటుతున్నారు. అయినప్పటికీ మహిళల్లో ఇంకా చైతన్యం రావాల్సిన అవసరం ఎంతో ఉంది. విద్య, వైద్య, ఆరోగ్య, శాస్త్ర, సాంకేతిక, సాహితీ, సాంస్కృతిక, సమాచార, రాజకీయ, క్రీడా తదితర రంగాల్లో రాణిస్తూ, సమాజంలో ప్రత్యేక గౌరవాన్ని పొందుతున్న మహిళల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండడం శుభ పరిణామం. ఇంటి, వంట పని చేస్తూ.. సంసార భారాన్ని అవలీలగా ఈదుతున్న మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.
- సికింద్రాబాద్/చిలకలగూడ/తిరుమలగిరి, మార్చి 7(ఆంధ్రజ్యోతి)

అబలకాదు.. సబల

● నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

32 సంవత్సరాలు.. 12వేల ప్రసవాలు



డాక్టర్ పద్మావతి, గైనకాలజిస్ట్

32 సంవత్సరాలుగా వైద్య వృత్తిలో గైనకాలజిస్ట్‌గా ఇప్ప టి వరకు 12 వేల ప్రసవాలతో అనేక మంది జన్మకి కారణమయ్యారు గైనకాలజిస్ట్ డాక్టర్ పద్మావతి. అందులో 100 మంది కవలలు, ముగ్గురు ట్రిప్‌లెట్స్ జన్మించారు. నగరంలోని వివిధ ఆస్పత్రుల్లో పని చేసి ప్రస్తుతం వైద్య రంగంలో విశేష కృషి చేస్తున్న ఆమె ప్రతిభను గుర్తించి, ఇటీవల మారేడుపల్లి, బసంత్ సహానీ ఆస్పత్రిలో డైరక్టర్‌గా పదోన్నతి పొందారు. ఉస్మానియ మెడికల్ కాలేజీలో పీజీ పూర్తి చేశా రు. శిశువు జన్మించిందని చెప్పగానే తల్లిదండ్రుల్లో ఆనందం మాటల్లో చెప్పలేమని, అదే మగబిడ్డ అయితే, వారి ఆనందానికి అవధులు ఉండవని డాక్టర్. పద్మావతి తెలిపారు. పేదలకి అవసరమైన వైద్య సేవలు అందజేస్తూ ప్రతిరోజూ ఇంటికి వెళ్లే లోపు ఎవరికో ఒకరికి సహయం చేయకుండా వెళ్లదని పలువురు ఆనందంగా చెబుతుంటారు.

ప్రభుత్వం మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సాహించాలి



క్రీడాకారిణి శ్రావణి

ప్రభుత్వం మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సాహించాలని తిరుమలగిరికి చెందిన ప్రముఖ బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్ జాతీయ క్రీడాకారిణి శ్రావణి అభిలాషించారు. 8 జాతీయ 20 జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని ఎన్నో మెడల్స్, ట్రోఫీలను అందుకున్నా ప్రభుత్వం ద్వారా ఎలాంటి ప్రోత్సాహం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా మహిళల పట్ల వివక్ష కొనసాగుతున్నట్టు అనిపిస్తోందని శ్రావణి తన అభిప్రాయం వ్యక్తం చేశారు. మహిళలు అందరినీ పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడంతో పాటు మహిళా క్రీడాకారులను ప్రోత్సాహించాలని కోరారు. చిన్నతనం నుంచి ఎన్నో ఆటు పోట్లను ఎదుర్కొని జాతీయ బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్‌లో రానించినట్టు తెలిపారు. క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి గౌరవించాలని కోరారు.

కుంభ మేళాలో సైతం వైద్య సేవలు



డాక్టర్. సుష్మ, లాలాగూడ, కేంద్రీయ ఆస్పత్రి

మధ్య తరగతి కుటుంబంలో పుట్టి, ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ కాలేజీ, (పుణే) ఎండీ జనరల్ మెడిసిన్ పూర్తి చేసి ఉత్తమ డాక్టర్‌గా అవార్డు అందుకున్నారు. భర్త డాక్టర్. పుట్టి పెరిగింది హైదరాబాద్. లాలాగూడ కేంద్రీయ ఆస్పత్రిలో ఎనిమిది సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారు. మహిళల కోసం యోగా, ఒత్తిడిని అధిగమించడానికి క్లాసులు నిర్వహిస్తూ ఉచిత వైద్య శిబిరాల్లో వైద్య సేవలు చురుగ్గా పాల్గొంటూ తన వంతుగా సమాజసేవకి దోహదపడుతున్నారు. కుటుంబానికి దూరంగా ఉండి, ఇటీవల ప్రయాగ్‌రాజ్, కుంభమేళాలో వైద్యసేవలు అందజేశారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకి వైద్య సేవలు అందజేయడం తృప్తి నిచ్చిందని ఆమె తెలిపారు.

కుటుంబ భారంతో పాటు విద్యా వ్యాప్తికి కృషి



బేతి అరుణ, ప్రభుత్వ అధ్యాపకురాలు

మధ్య తరగతి కుటుంబంలో పుట్టి పెరిగి, కష్టపడి చదివి భర్త ప్రోత్సాహంతో ఉన్నత చదువులు చదివి, డియస్సీలో ప్రతిభ చూపి ప్రభుత్వ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఎంతో మంది విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చి దిద్దుతున్నారు బేతి అరుణ. భర్త కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. ముగ్గురు కుమారులు కాగా పెద్ద కుమారుడు మానసిక వైకల్యంతో జన్మించాడు. ఇద్దరు కవలలు 10వ తరగతి చదువుతున్నారు. కుటుంబ పరిస్థితులను సరి చూసుకుంటూ.. ప్రతి రోజూ 40కిలో మీటర్లు ప్రయాణం చేసి మంచల్ మండలంలో విధులు నిర్వహిస్తున్నారు. భర్త ప్రోత్సాహంతో ఉన్నత చదువులు అభ్యసించి ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలి



మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలి. అలాని మగావాళ్లను కించ పరచాలని కాదు. స్త్రీలు కార్యేషు దాసీ, కరణేషు మంత్రి, భోజ్యేషు మాత, శయనేషు రంభలా ఉండాలని పూర్వీకులు మహిళలకు చెప్పడం జరిగింది. ప్రతి మహిళ పెద్దలు చెప్పిన ఈ విషయాలను పాటిస్తే ప్రతి గృ హం స్వర్గ సీమ అవుతుంది. తద్వార దేశంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవిస్తారు. 14సంవత్సరాల నుంచి సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవస్థానంలో ప్రతి శుక్రవారం లలితా సహస్ర పారాయణం చేస్తూ అమ్మవారి సేవలో తరిస్తున్నాం. ఆది పరాశక్తి అయిన అమ్మవారిలా మహిళలందరూ అన్ని రంగాల్లో దేనికీ తీసిపోరని నిరూపించుకోవాలని ఆకాంక్షిస్తూ మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

● కౌశికే రాజశ్రీ, లలితా పారాయణం గ్రూప్, ఉజ్జయినీ మహంకాళి దేవస్థానం

ధర్మకర్తలు ఆలయాభివృద్ధికి కృషి చేయాలి

● దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి

రాంగోపాల్‌పేట్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నూతనంగా ప్రభుత్వంచేత నియమించబడిన ధర్మకర్తలు ఆలయాభివృద్ధికి కృషి చేయాలని దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి పిలుపునిచ్చారు. శుక్రవారం రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని పాన్ బజార్‌లోని వేణు గోపాల స్వామి దేవస్థానంలో ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా నూతన ధర్మకర్తలతో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి స్వామి వారి ముందు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ధర్మకర్తలుగా ప్రమాణ స్వీకారం చేసిన కుంచులకంటి లక్ష్మి, మాకు యెల్లేష్, ముదార్తి అశోక్, డొంకన బాబు, ఆకుల సదానంద్ సమావేశం ఏర్పాటు చేసుకొని యెల్లేష్‌ను ధర్మకర్తల మండలి చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రవికాంత్ కర్నే, పంచముఖి హనుమాన్ ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బచ్చు రాజ్ కుమార్,



నూతన ధర్మకర్తలతో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి

కాంగ్రెస్ పార్టీ సనతనగర్ నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షులు త్రికాల మనోజ్ కుమార్ ముదిరాజ్, రాంగోపాల్‌పేట్ డివిజన్ అధ్యక్షులు దుండిగల్ల మల్లికార్జున్, సీనియర్ నాయకులు కఠారి మహేష్ యాదవ్, శ్రీకాంత్, అనురాగ్, ఆలయ మాజీ ధర్మకర్తల మండలి చైర్మన్ బొల్లు శ్రీనివాస్, మాజీ ధర్మకర్తలు ముత్యాల సాయిబాబా, దర్శనం శివకుమార్, ఉప్పు రామ్మోహన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువకుడి అరెస్ట్

బోరబండ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న యువకుడిని మధురానగర్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలుచోట్ల క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్టు ఫిర్యాదులు వచ్చాయి. ఎస్ఐ శివ శంకర్ సిబ్బందితో కలిసి గురువారం రాత్రి విధి నిర్వహణలో ఉండగా గాంధీబొమ్మ వద్ద ఓ యువకుడు అనుమానాస్పదంగా తిరుగుతుండగా, అదుపులోకి తీసుకుని విచారించగా ఆన్‌లైన్ బెట్టింగ్ చేస్తున్నట్టు అంగీకరించాడు. అతడి వద్ద ఉన్న మొబైల్‌ను స్వాధీనం చేసుకుని పోలీసులు అరెస్ట్ చేశారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

బోరబండ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ తుల్జారామ్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా ఉప్పరపల్లి గ్రామానికి చెందిన యాపచెట్టు రాజు (38)కు మతిస్థిమితం సరిగా ఉండటం లేదు. ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం ఎస్పీఆర్ హిల్స్ రాజీవ్‌గాంధీ నగర్‌లోని సోదరుడి ఇంటికి గత నెల 28న వచ్చాడు. నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాజు తిరిగి రాలేదు. తెలిసిన వారి వద్ద విచారించినా ప్రయోజనం లేకపోవడంతో రాజు సోదరుడు మహేష్ బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలులో గుండెపోటుతో ప్రయాణికుడి మృతి

బర్కత్‌పుర, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో గుండెపోటుతో ఓ ప్రయాణికుడి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కడప జిల్లాకు చెందిన బి.నారాయణ(52) భార్య, బంధవులతో కలిసి వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో కాచిగూడకు వస్తున్నాడు. శుక్రవారం ఉదయం జనరల్ బోగిలో ఉన్న నారాయణకు గుండెపోటు వచ్చి మృతి చెందాడు. రైలు కాచిగూడ రైల్వే స్టేషన్‌లో 5వ ప్లాట్ ఫారంలో ఆగిన తర్వాత నారాయణ మృతదేహన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యాప్రాల్‌లో తల్లి.. లాలాగూడలో కూతురు!

● ఒకే రోజు ఇద్దరి మృతి ● అరవింద్‌పై కుటుంబ సభ్యుల ఫిర్యాదు
● నగరంలో సంచలనంగా మారిన జంటహత్యలు

అడ్డగుట్ట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): 80ఏళ్ల తల్లి యాప్రాల్‌లో... 45 ఏళ్ల కూతురు లాలాగూడలో ఒకేరోజు మృతి చెందారు. ఈసంఘటనలు నగరంలో సంచలనంగా మారాయి. రెండు హత్యలకూ ఒకే వ్యక్తి కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అనుమానిస్తున్న వ్యక్తే ఈ ఘాతుకాలకు పాల్పడ్డాడా? అతడికి ఎవరైనా సహకరించారా..? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

లాలాగూడ, జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన ఘటనలకు సంబంధించి పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ కార్పొరేషన్ యాప్రాల్ భరత్‌నగర్‌లో ఉడుగుల సుశీల (80)కు జ్ఞానేశ్వరి(45), లక్ష్మీ(40) ఉమామహేశ్వరి(35) ముగ్గురు కుమార్తెలు. కుమారుడు శివ కైలాష్ ఉద్యోగ రీత్యా అమెరికాలో ఉంటున్నాడు. సుశీల 2018లో యాప్రాల్‌లోని కౌకూర్ భరత్‌నగర్‌లో ఇల్లు నిర్మించుకొని కూతురు ఉమమహేశ్వరి కోడలు స్రవంతితో కలిసి ఉంటున్నారు. ఇద్దరు కూతుర్లు జ్ఞానేశ్వరి, లక్ష్మీ మిర్జాలగూడలోని రైల్వే క్వార్టర్స్‌లో నివసిస్తున్నారు. సుశీల కుమార్తెలు ఎవరికీ వివాహం జరుగలేదు. ఈ నెల 6న ఉదయం కూతురు, కోడలు కలిసి విధులకు వెళ్లారు. భరత్‌నగర్‌లోని ఇంట్లో సుశీల ఒంటరిగా ఉంది. గురువారం రాత్రి 7 గంటల ప్రాంతంలో ఇంటి నుంచి పెద్ద శబ్దాలు వచ్చినట్టు చుట్టూ పక్కల వారు గమనించి కూతు రు ఉమామహేశ్వరికి సమాచారం ఇచ్చారు. వెంటనే ఆమె తల్లి సుశీలకు ఫోన్ చేయగా ఆమె స్పందించలేదు. ఇంటి పక్కనే ఉంటే వెంకటేష్ సారంగపాణికి ఫోన్ చేసి తమ తల్లిని చూడాలని కోరింది. ఇంట్లోకి వెళ్లి చూడగా సుశీల అప్పటికే మరణించినట్టు గుర్తించారు. ఉమామహేశ్వరి రాత్రి ఇంటికి వచ్చి చూసే సరికి సుశీల విగత జీవిగా కనిపించింది. వెంటనే ఉమామహేశ్వరి బంధువులకు తెలిపింది. అరవింద్‌కుమార్ అలియాస్ అరుణ్ అనే వ్యక్తి బిల్డింగ్ మొదటి అంతస్తు నుంచి దూకి వెళ్లాడని చుట్టూపక్కల వారు చెప్పారు. అరవింద్‌కుమార్ అప్పుడ్పుడు సుశీల ఇంటికి వచ్చి వెళ్తుండేవాడని, కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనాస్థలానికి చేరుకొని మృత దేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. తమ తల్లి సుశీలను అరవింద్‌కుమార్ అనే వ్యక్తి చంపి మూడున్నర తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లాడని, కుమార్తె ఉమామహేశ్వరి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు.

లాలాగూడలో కూతురు జ్ఞానేశ్వరి..

సుశీల కూతురు జ్ఞానేశ్వరి లాలాగూడ రైల్వే క్వార్టర్స్‌లోని ఇంట్లోని నీటి సంపులో నిర్జీవంగా పడి ఉంది. స్థానికుల ఫిర్యాదు మేరకు ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. జ్ఞానేశ్వరి మానసిక స్థితి సరిగా ఉండేది కాదని స్థానికులు చెబుతున్నారు. లక్ష్మితో సన్నిహితంగా ఉండే అరవింద్ తరచూ లాలాగూడ, భరత్‌నగర్‌లోని వారి ఇంటికి వచ్చే వాడని, వీరిద్దరు సన్నిహితంగా ఉండడం కుటుంబ సభ్యులకు ఇష్టం లేదని సమాచారం. లాలాగూడలో లక్ష్మిని కలిసేందుకు అరవింద్ వస్తుండేవాడని, అక్కడ జ్ఞానేశ్వరి ఉండడం అతనికి ఇష్టం లేదని చెబుతున్నారు. ఈ క్రమంలో జ్ఞానేశ్వరి సంపులో నిర్జీవంగా పడి ఉండడం అనుమానాలకు తావిస్తోంది. అరవింద్ రెండు హత్యలు చేశాడా..? ఇతరత్రా కారణాలున్నాయా..? అన్న కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

మార్కెట్‌లోకి కొత్త ఎలక్ట్రికల్ విటారా

హైదరాబాద్ సిటీ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకీ కొత్త ఎలక్ట్రికల్ వాహనం ఈ విటారాను అందుబాటులోకి తెచ్చింది. సైనిక్‌పురిలోని నెక్సా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్ రెడ్డి పాల్గొని వరుణ్ మోటర్స్‌లో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి, ఈ విటారా కార్ల విక్రయాలను లాంఛనంగా ప్రారంభించారు. దూర ప్రయాణాలు చేసేవారి కోసం ఈ విటారా కారులో 49, 61 కిలోవాట్ల బ్యాటరీలను అమర్చినట్లు సంస్థ నిర్వాకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ అమిత్ కుమార్ సింగ్, వరుణ్ గ్రూప్ డైరెక్టర్ డీకే రాజు, జనరల్ మేనేజర్ శ్రీధర్ పాల్, ఏజీఎం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సైనిక్‌పురి వరుణ్ మోటర్స్ కార్యాలయంలో ఈ విటారా కారును చూపుతున్న మారుతి సుజుకి సంస్థ ప్రతినిధులు

యోగానంద మహాసమాధి ఆరాధనోత్సవాలు

హైదరాబాద్ సిటీ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): బేగంపేట చికోటి గార్డెన్స్‌లోని యోగదా సత్సంగ ధ్యాన కేంద్రంలో యోగదా సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకుడు పరమ హంస యోగానంద మహాసమాధి ఆరాధనోత్సవాలను భక్తి ప్రపత్తులతో నిర్వహిస్తున్నారు. భక్తులు యోగా నంద చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ప్రత్యేక ధ్యానం, భజనల్లో పాల్గొంటున్నారు. కాగా, ఈనెల 9న సాయంత్రం 5 గంటలకు వైఎస్ఎస్ గురు పరంపరలో ఒకరైన స్వామి యుక్తేశ్వర్‌గిరి మహాసమాధి ఆరాధన ఉత్సవాలు బేగంపేట ధ్యానకేంద్రంలో జరుగుతాయని వైఎస్ఎస్ కార్యదర్శి శశివధనారెడ్డి తెలిపారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

ఎర్రగడ్డ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని విజయలక్ష్మి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. శ్రీమంత్ర సహిత శ్రీసూక్త హవనము, మంగళ శాసనం, యాగశాలలో నిత్య హోమం తదితర కార్యక్రమాలను చేపట్టారు. సాయంత్రం విజయలక్ష్మి అమ్మవారి గజవాహన సేవలో భాగంగా దేవాలయం నుంచి ఎస్సార్‌నగర్ వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈఉత్సవాలు 10వ తేదీతో ముగుస్తాయని దేవాలయ కమిటీ చైర్మన్ చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి పిజనార్దన్, కోశాధికారి ఎన్‌వీ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు గట్టు రంగాచారి, మేనేజర్ మల్లేష్ పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రైల్వేస్టేషన్‌లో మంటలు.. ప్రయాణికుల ఆందోళన

ఖైరతాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రైల్వే పట్టాల మధ్య ఉన్న చెత్తతో పాటు ఎండిపోయిన మొక్కలకు నిప్పు అంటుకోవడంతో శుక్రవారం ఖైరతాబాద్ రైల్వేస్టేషన్‌లో ఆందోళన నెలకొంది. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఖైరతాబాద్ రైల్వే స్టేషన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అక్కడ ఎంఎంటీఎస్ రైళ్ల కోసం వేచిఉన్న ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. దట్టమైన పొగలు రావడంతో పాటు పైభాగంలో హైటల్టేజీ విద్యుత్ వైర్లు ఉండడంతో ప్రయాణికులతో పాటు అధికారులు, సిబ్బంది ఆందోళన చెందారు. కొందరు ప్రయాణికులు నీళ్లు తీసుకొచ్చి చల్లడంతో కాసేపటికి మంటలు అదుపులోకి వచ్చాయి. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగా, ఖైరతాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారం వరకు ఫైరింజన్ వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఒకవేళ భారీ ప్రమాదం జరిగితే మంటలను ఎలా ఆర్పేవారని ప్రయాణికులు, స్థానికులు ప్రశ్నించారు. ఒకవైపు రైల్వే ప్లాట్ ఫారం పైకి బస్తీ గుండా వచ్చే మార్గాన్ని కొందరు స్థానికులు ముళ్ల పొదలు, చెట్ల కొమ్మలు వేసి రాకపోకలు జరగకుండా చేయగా రోడ్డువైపు నుంచి వచ్చే రహదారి గుండా వాహనాలు వచ్చే ఏర్పాట్లు చేయలేదు.

